క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్‌ని కలిసిన డీఈవో



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఈవో రమేష్

చీమకుర్తి: జిల్లా విద్యాశాఖాధికారిగా పీ రమేష్ సోమవారం చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

చింతతోపునకు వేలం

మద్దిపాడు: స్థానిక చింతతోపులో చింతకాయలకు, ఎండిపోయిన రెండు చెట్లకు సోమవారం వేలం నిర్వహించినట్లు ఈవోపీఆర్డీ కార్యాలయ ఏవో సుబ్బారావు తెలిపారు. ఎండిపోయిన రెండు చింత చెట్లకు ఐదుగురు వేలంలో పాల్గొనగా, మద్దా లక్ష్మీనారాయణ రూ.24 వేలకు పాట పాడారు. ఈ సంవత్సరం మిగిలిన 13 చెట్లకు సంబంధించిన కాపును వేలం వేయగా షేక్ యూసఫ్ రూ.6,900కు పాడుకున్నట్లు తెలిపారు. మొత్తం డబ్బును మద్దిపాడు పంచాయతీ నిధులకు జమ చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఆశా లక్ష్మి పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవానికి రూ.25 వేల విరాళం



విరాళం అందిస్తున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: స్థానిక రామ్‌నగర్ 1వ లైన్‌లోని శ్రీసీతారామస్వామి ఆలయ వార్షికోత్సవానికి ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి సోమవారం రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. ఈ నెల 27వ తేదీ నుంచి ఆలయం వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మారం వెంకారెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

25న సంతనూతలపాడు మండల సమావేశం

చీమకుర్తి: సంతనూతలపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 25వ తేదీ ఉదయం 10.30 గంటలకు సంతనూతలపాడులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కే రాఘవేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బీ విజయ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో పాటు అన్ని శాఖల మండల అధికారులు నివేదికలతో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఒంగోలు టౌన్: నలుగురు పేకాటరాయుళ్లను సెబ్ పోలీసులు పట్టుకున్న ఘటన సోమవారం స్థానిక లాయరుపేటలో చోటుచేసుకుంది. ఓ పేకాట శిబిరంపై దాడిచేసిన సెబ్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని రూ.12,130 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని స్థానిక వన్‌టౌన్ పోలీసులకు అప్పగించగా, కేసు నమోదు చేశారు.

ఉన్నత చదువులకు సూర్యశ్రీ ట్రస్ట్ సహకారం

ఒంగోలు అర్బన్: ఖమ్మం జిల్లాకు చెందిన పూజిత నీట్‌లో మంచి ర్యాంకు సాధించింది. చదువుల్లో రాణిస్తున్న పూజితకు సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు సెక్రటరీ షేక్ సర్దార్ బాష దాతలతో మాట్లాడి ప్రవాస భారతీయురాలైన శ్రీలత తన సంస్థ ఏ20 ద్వారా రూ.17,800 విలువైన పుస్తకాలు అందజేశారు. ట్రస్టు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు చేతుల మీదుగా పుస్తకాలు అందజేశారు. నేరెళ్ల శ్రీనివాసరావు, బొద్దుపాటి వెంకట్, గొల్లపూడి రవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

మార్కాపురం: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ప్రభుత్వ సిబ్బంది ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున్న నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ చందన ఆదేశించారు. సోమవారం ఆమె కోలభీమునిపాడు, జమ్మనపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఎన్‌డబ్ల్యూపీసీ షెడ్లను పరిశీలించి చక్కగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్లాట్ ఫాంపై వ్యర్థాలు వేరు చేయాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా నాయకుల విగ్రహాలు ఉంటే కోడ్ ఆఫ్ కాండెక్ట్‌ను దృష్టిలో పెట్టుకొని వాటికి ముసుగు వేయాలన్నారు.

గణతంత్రం కాదు.. కులతంత్రం

● ప్రముఖ జర్నలిస్ట్ సతీష్ చందర్



పుస్తక సమీక్ష సభలో మాట్లాడుతున్న సతీష్ చందర్

ఒంగోలు టౌన్: భారతదేశం గణతంత్ర దేశం కాదని.. కులతంత్ర దేశమని, ప్రతి రంగంలోనూ కులం పడగలో ప్రజలు బతకాల్సి వస్తోందని ప్రముఖ సంపాదకుడు, రాజకీయ విశ్లేషకుడు సతీష్ చందర్ అన్నారు. ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన సి ఫర్ క్యాస్ట్ పుస్తక సమీక్ష సభలో ఆయన పాల్గొన్నారు. దేశం గణతంత్రమైతే దేశంలోని గ్రామాల్లో వర్ణతంత్రం కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. అన్ని విధాలుగా ఎదిగిన బీసీల నుంచి వెనకబడిన బీసీలను వేరుచేసి వారిని నాయకత్వానికి దూరం చేస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలలో చెంచాగిరి చేసే నాయకత్వం పెరిగిపోవడం వలనే అన్ని రంగాల్లో వారి ప్రాతినిధ్యం తగ్గిపోతూ అంతరించే స్థితికి చేరుకుందన్నారు. ఎస్సీ, ఎస్టీలు తమ ఉనికిని తాము కాపాడుకుంటూనే ఓబీసీల అవసరాన్ని గుర్తించి ఎకొత్త కూటమిని తయారు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలో, తమ హక్కులు కాపాడే నాయకులను ఎంచుకునే విషయంలో లోపభూయిష్టంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత కులాల మధ్య చిచ్చు రాజేసి వారు సొంతంగా నిలబడి అభివృద్ధి చెందకుండా మనువాదులు కుట్రలు చేస్తున్నారన్నారు. కార్పొరేట్ రంగంలో లోతుగా పాతుకుపోయిన కులం కేవలం కొంతమంది అవసరాలను మాత్రమే తీరుస్తోందని, అంతులేని వివక్షతో మిగతా వర్గాలకు అవకాశాలు లేకుండా చేస్తోందని అన్నారు. ప్రైవేటు రంగాన్ని బలోపేతం చేస్తున్న పాలకవర్గాలు రాజ్యాంగ లక్ష్యాలను నీరుగారుస్తున్నాయని మండిపడ్డారు. సమాజం కుల స్వభావాన్ని బట్టబయలు చేసి నిద్రపోతున్న సమాజాన్ని సీ ఫర్ క్యాస్ట్ పుస్తకం జాగృతం చేస్తోందని ప్రముఖ కవి జయరాజ్ అన్నారు. దేశంలో ప్రజలు కులాల వారీగా విడిపోయి ఉన్నారని, ఇక్కడ కులస్వామ్యం రాజ్యమేలుతోందని స్పష్టం చేశారు.

కుల వ్యవస్థ మరింతగా వేళ్లూనుకుంటున్న నేపథ్యంలో అంబేద్కరిజం ద్వారా ప్రజలను మేల్కొలిపేందుకు బ్లూవింగ్స్ ఫౌండేషన్ పనిచేస్తోందని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి మల్లికార్జునరావు తెలిపారు. సభకు డాక్టర్ పారా రమేష్ సమన్వయకర్తగా వ్యవహరించగా, డాక్టర్ శివరామకృష్ణ, ఎం.కోటేశ్వరరావు, కూరపాటి విజయ్‌రాజ్, మొగిలి దేవ, సుధీర్‌బాబు, సీహెచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా అరబోలు



ప్రభుదాసు

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా విభాగం మండల కన్వీనర్‌గా మద్దిపాడు బీసీ కాలనీకి చెందిన అరబోలు ప్రభుదాసును నియమించారు. కో కన్వీనర్లుగా సాయి సుమంత్, కొక్కిలగడ్డ ప్రతాప్‌కుమార్, నాయుడు శివ, బొమ్మల జశ్వంత్‌కుమార్ నియమితులయ్యారు. ఆ మేరకు పార్టీ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ తమపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తామని, తమను నమ్మి బాధ్యతలు అప్పగించినందుకు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు.

రథం నిర్మాణానికి శిద్దా రూ.2 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

ఒంగోలు: దర్శి శివాలయం రథం నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సోమవారం తన నివాసంలో రూ.2 లక్షల విరాళం అందించారు. దర్శిలోని శ్రీఅన్నపూర్ణ సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం నూతన రథోత్సవం, మహాశివరాత్రి మహోత్సవం కార్యక్రమం సందర్భంగా నూతన రథం నిర్మాణం కోసం ఆ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు శిద్దా రాఘవరావు దంపతులు, వారి తనయుడు శిద్దా సుధీర్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నారపుశెట్టి శివప్రసాద్, గోసుల నాగేశ్వరి, గుడిపల్లి నాగలక్ష్మి, మెడ వెంకట నాగేశ్వరరావు, శానం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నటరాజ అలంకారంలో స్వామివారు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

పొదిలి రూరల్: మహాశివరాత్రి సందర్భంగా పొదిలిలో జరుగుతున్న పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వర స్వామి బ్రహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు గురువారం చంద్ర వాహనంపై నటరాజ అలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి పండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్వతీ పరమేశ్వరిని ఉత్సవ మూర్తులను పూలతో ప్రత్యేకంగా అలంకరించి పొదిలి పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదాతలు యాదాల వెంకటేశ్వర్లు, మంచికంటి సుధీర్‌కుమార్, సునీల్‌కుమార్, టంగుటూరి సూర్యనారాయణ, చంద్రపాటి వెంకట సీతారామాంజనేయప్రసాద్‌లు ప్రత్యేక పూజలు చేసి తమ మెక్కులు తీర్చుకున్నారు. అనంతరం నైవేద్యాలు చెల్లించి తీర్థ ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు.

చిరువ్యాపారులకు తోపుడు బండ్ల పంపిణీ



తోపుడు బండ్లు అందజేస్తున్న కమిషనర్, రోటరీ క్లబ్ ప్రతినిధులు

దర్శి: రోటరీ క్లబ్ దర్శి ఆధ్వర్యంలో సోమవారం చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరావు చేతుల మీదుగా వ్యాపారులకు రూ.12 వేల విలువైన ఎనిమిది మంది చిరు వ్యాపారులకు బండ్లు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మహేశ్వరరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ దర్శి సేవా గుణంతో ముందుకొచ్చి చిరు వ్యాపారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ దర్శి అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి నలుగురికి, సెక్రటరీ రెడ్డిమాసు శ్రీనివాసరావు ముగ్గురికి, పాలకొలను రవీంద్రరెడ్డి ఒకరికి తోపుడు బండ్లకు సహాయం చేశారు.కార్యక్రమంలో రోటరీ క్లబ్ కోశాధికారి కర్జా భాస్కరరెడ్డి, సభ్యులు డాక్టర్ బాషా, డాక్టర్ కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, లక్ష్మీనారాయణ, పానుగంటి కోటేశ్వరరావు, పేరిరెడ్డి, నారాయణరెడ్డి, రాజారెడ్డి, మార్తుల భాస్కర్, శివకోటిరెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి



వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కాపురం: మండలంలోని వేములకోట ఇలాఖాలో సర్వే నంబర్ 414/1లోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకున్నారని, ఆక్రమణదారులను తొలగించి గ్రామంలో అర్హులైన పేదలకు జగనన్న హౌసింగ్ కాలనీ–2లో ఇంటి పట్టాలు ఇప్పించాలని వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు జంకె వెంకటనారాయణరెడ్డి, ఎంపీటీసీ నంద్యాల వీరయ్య, మాజీ ఎంపీటీసీ చాగంటీటి వెంకటనారాయణరెడ్డి, జంకె మోహన్‌రెడ్డి, హనుమయ్య, కోటిరెడ్డిలు సోమవారం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందించారు. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి విచారణ చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. అంకిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, యాకోబ్, అలూర్‌రెడ్డి, పుల్లయ్య, పెద్ద గురవయ్య, లక్ష్మిరెడ్డి, ఆవులయ్య తదితరులు అర్జీ ఇచ్చిన వారిలో ఉన్నారు.

ఒంగోలు రోడ్డుకు మరమ్మతులు చేయాలి

మార్కాపురం నుంచి రైల్వే స్టేషన్ వెళ్లే రహదారి గుంతలు పడి ఇబ్బందిగా ఉందని, మరమ్మతులు చేయాలని బీజేపీ నాయకులు బొంతల కృష్ణ, చెన్నయ్య, శ్రీధర్, ఆదిలక్ష్మి తదితరులు వినతిపత్రం ఇచ్చారు. రోడ్డును వెడల్పు చేయాలని కోరారు.

బాలిక అదృశ్యంపై కేసు

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపారు. పసుపుగల్లు గ్రామానికి చెందిన బాలిక దర్శిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చింది. ముండ్లమూరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం వరకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయల్దేరింది. ఆ తర్వాత సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద వెతికారు.

ఆచూకీ లేకపోవడంతో సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నత్రజనితో ఆముదంలో అధిక దిగుబడి

బేస్తవారిపేట: ఎండ తీవ్రత పెరిగినప్పుడు ఆముదం పంటలో మగ పుష్పాలు ఎక్కువగా ఏర్పడి దిగుబడి తగ్గిపోతుందని గిద్దలూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు డీ బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని పందిళ్లపల్లెలో పంట పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. విత్తనం వేసిన 30–35 రోజులకు 6 కిలోల నత్రజని, 60–65 రోజులకు ఆరు కిలోల నత్రజని ఎరువులు చల్లుకోవడంతో మగ పూత శాతం తగ్గి, ఆడ పుష్పాలు ఎక్కువగా వస్తాయన్నారు. నీటి వసతి ఉన్న భూముల్లో ఆముదం పంట వేసిన 40–45 రోజులకు ఒక మొగ్గను ఉంచి మిగిలిన కొమ్మలను తుంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో జక్కం మెర్సీ, ఏఈవో, వీఏఏలు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

మార్కాపురం టౌన్: మార్కాపురం ప్రాంత విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న పట్టణంలోని డివిజన్ విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఈఈ పీవీ నాగేశ్వరరావు, డీఈ షీయానాయక్ సోమవారం తెలిపారు. రిటైర్డ్ సెషన్స్ జడ్జి ఎస్. విక్టర్ ఇమ్మానుయేల్ అధ్యక్షతన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అదాలత్ నిర్వహిస్తామని, విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవచ్చని సూచించారు.

మామపై అల్లుడి దాడి

మార్కాపురం: పాత కక్షలను మనసులో పెట్టుకొని మామపై అల్లుడు పదునైన ఆయుధంతో దాడి చేశాడు. ఈ సంఘటన సోమవారం మండలంలోని జమ్మనపల్లిలో జరిగినట్లు రూరల్ ఎస్‌ఐ సుమన్ తెలిపారు. గ్రామానికి చెందిన దాసరి పెద్ద అంకాలుపై అల్లుడు చిన్నఅంకాలు సోమవారం పదునైన ఆయుధంతో దాడి చేయడంతో తీవ్రం గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స కోసం ఒంగోలు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సర్పంచ్ సొంత నిధులతో డీప్ బోర్

త్రిపురాంతకం: మండలంలోని సంఘం తండా ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు సర్పంచ్ ఆర్.హనిమీబాయి సక్రునాయక్ తన సొంత నిధులతో డీప్ బోరు ఏర్పాటు చేయించారు. డీప్ బోరు ఏర్పాటుకు లక్ష రూపాయలు వెచ్చించినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజానాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాలాజీ నాయక్, వైఎస్సార్ సీపీ నాయకుడు బాలునాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

త్రిపురాంతకం: మండలంలోని కంకణాలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు 9, 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు, నోట్‌బుక్స్ గురువారం పంపిణీ చేశారు. పాఠశాలలో వినియోగించేందుకు మైక్ సెట్‌ను ఎంఈఓ కె.తులసి మల్లికార్జుననాయక్, ప్రధానోపాధ్యాయుడు ఉడుముల శ్రీనివాస రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, వెంకటేష్‌తోపాటు మరో 15 మంది పాల్గొన్నారు.

జేకేసీ శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు

ఒంగోలు: స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలోని జవహర్ నాలెడ్జి సెంటర్ (జేకేసీ) ద్వారా శిక్షణ పూర్తిచేసుకున్న వారికి కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి సోమవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నైపుణ్యత ఉన్న విద్యకు నేడు ప్రాధాన్యత ఉందన్నారు. అలాంటి వారే ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారని తెలిపారు. జేకేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏవీ రాజ్యలక్ష్మి, ఐక్య కో ఆర్డినేటర్ కుసుమకుమారి, మెంటార్ జేఎస్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థినులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కళ్యాణి

విద్యార్థినులకు స్టడీ చైర్స్ పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయక్

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రికల్ బోర్డు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు సోమవారం స్టడీ చైర్స్, ప్యాడ్స్, లైబ్రరీ పుస్తకాలు పంపిణీ చేశారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పే బ్యాక్ సొసైటీ కార్యక్రమంలో భాగంగా రూ.1.50 లక్షల విలువైన వాటిని అందజేసినట్లు ఏపీసీపీడీసీఎల్ రాష్ట్ర కార్యదర్శి ఏవీ కిరణ్ తెలిపారు. సంస్థ కన్వీనర్ ఎం.వసంతరావు, ఎల్.రఘుబాబు, ఎస్.ఆనందరావు, ఎన్.లక్ష్మానాయక్, డి.అంకబాబు, బి.శిరీషా, కే స్వప్నలత, డి.మధుసూదనరెడ్డి, యు.దానయ్య, టి.లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

ఒంగోలు టౌన్: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ నగర వర్కింగ్ సెక్రటరీ శ్రీరాం శ్రీనివాసులు కోరారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదురుగా మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, చనిపోయిన కార్మికులకు బదులు వారి కుటుంబంలో మరొకరిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఎలాంటి సమాచారం లేకుండా నిలిపి వేసిన 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు బదులుగా వారి కుటుంబంలో మరొకరిని విధుల్లోకి తీసుకోవాలని, వారికి రావాల్సిన బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నగర కార్యదర్శి యు.రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

92 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో పేస్ కాలేజీ ప్రిన్సిపాల్ మూర్తి

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో 247 ఏఐ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 92 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వివిధ కాలేజీలకు చెందిన 394 మంది విద్యార్థులు పాల్గొనగా, వారికి రాతపరీక్ష, బృంద చర్చ, ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించారు. వారిలో 92 మందిని వాయిస్, నాన్ వాయిస్ ఎగ్జిక్యూటివ్‌లుగా నియమించి నియామక పత్రాలు అందించారు. ఎంపికైన విద్యార్థులను కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ ప్లేస్‌మెంట్స్ కె.రూప, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్.వీరాంజనేయులు అభినందించారు.

వ్యవసాయాధికారుల విచారణ



విచారిస్తున్న వ్యవసాయాధికారులు

దొనకొండ: మండలంలోని చందవరంలో 2020–21లో ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసింది. ఆర్‌బీకే సిబ్బంది పొలం లేని వారి పేర్ల మీద ఈ–క్రాప్ చేసి త్రిపురాంతక మండలం వెల్లంపల్లి గ్రామ రైతుల నుంచి వరి కొనుగోలు చేసి సిబ్బంది మరి కొంతమంది చేతివాటంతో లక్షలు మింగేశారని ఆరోపణలు వచ్చాయి. గ్రామ మాజీ సర్పంచ్ నూనె రవికుమార్ జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలో వ్యవసాయ శాఖ విచారించి ఆర్‌బీకే సిబ్బందిపై చర్యలు తీసుకుంది. స్థానిక ఆర్‌బీకేలో జిల్లా వ్యవసాయశాఖ అధికారుల ఆదేశాల మేరకు జిల్లా భూ రక్షణ విభాగం అధికారి సుబ్రహ్మణేశ్వరరావు, జిల్లా వ్యవసాయ డిప్యూటీ డైరెక్టర్ బి.ఎఫ్రాయిమ్, దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు పి.నిర్మలాదేవి సమక్షంలో సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుడైన రవికుమార్‌ను, మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ గుమ్మా వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ వజ్రగిరి రాణి సాలోమన్, వరి కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి దగ్గుల వెంకటేశ్వరరెడ్డిని, మండల వ్యవసాయాధికారులను విచారించి స్టేట్‌మెంట్ నమోదు చేశారు. నివేదికను జిల్లా వ్యవసాయ అధికారులకు అందజేస్తామని తెలిపారు. వారి వెంట వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇద్దరు టీచర్ల నియామకం

పుల్లలచెరువు: మండలంలోని రెండు జిల్లా పరిషత్ హైస్కూళ్లలో ఇద్దరు ఉపాధ్యాయులు నూతనంగా విధుల్లో చేరినట్లు ఎంఈఓ శామ్యూల్‌జాన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుల్లలచెరువు జెడ్పీ స్కూల్లో గణిత ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, పీపీపల్లి జెడ్పీ స్కూల్లో ఇంగ్లిష్ టీచర్ కృపాదానాన్ని జిల్లా అధికారులు నియమించగా వారు విధుల్లో చేరారని ఎంఈఓ వివరించారు.

వాహనాలకు జరిమానా

సింగరాయకొండ: జాతీయ రహదారిపై పరిమితికి మించి వేగంగా వెళ్తున్న 100 వాహనాలకు సోమవారం జరిమానా విధించినట్లు ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు. మండలంలోని పెరల్ డిస్టిలరీ వద్ద స్పీడ్ గన్ ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని అంచనా వేశామని, హద్దు మీరి ప్రయాణించిన ఒక్కో వాహనానికి రూ.400 చొప్పున మొత్తం రూ.40 వేలు జరిమానా విధించామని ఎస్సై వివరించారు.